క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయండి

ములకలచెరువు : రాష్ట్ర 3వ మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు నరసింహులు, అంజనప్ప మండల ప్రజలను కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ... జిల్లా కేంద్రం రాయచోటిలో 27వ తేదీ నుంచి జరిగే గిరిజన సమాఖ్య సభలకు గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

27న స్పాట్ అడ్మిషన్లు

బి.కొత్తకోట : ఈ ఏడాది రెగ్యులర్‌గా పాసైన పది విద్యార్థులకు ఈనెల 27న ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో ఖాళీగా ఉన్న సీఈసీ,హెచ్ ఈసీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ రామ్‌కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు విద్యార్థులు గురుకుల విద్యాలయానికి రావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కలికిరి : స్థానిక పట్టణ పరిధిలోని టి.చదివేవాండ్లపల్లి పాఠశాల ఆవరణలో ఉన్న పోలింగ్ స్టేషన్లను మంగళవారం తహసీల్దారు భాగ్యలత పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్ల సంఖ్య, అందుబాటులోని సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎల్ఓలు చేపడుతున్న ఇంటింటి ఓటరు సర్వేని ఆమె తనిఖీ చేసి, సర్వే వేగవంతానికి బిఎల్ఒలకు సూచనలిచ్చారు.

ద్విచక్రవాహనాల వేలం

కలికిరి : కలికిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్రవాహనాలకు మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.1.24 లక్షలు పలికినట్లు ఎస్ఐ కే.రహీముల్లా తెలిపారు. మొత్తం 14 ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహించగా పాటదారులు 14 వాహనాలను వేలం పాడుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు పాటదారులకు ఆయా వాహనాలను అప్పగించనున్నట్లు తెలిపారు.

విద్యా సంస్థలు బంద్

మదనపల్లె సిటీ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలో విద్యా సంస్థల బంద్ కార్యక్రమం నిర్వహించారు. అన్ని కాలేజీలు, పాఠశాలలను మూసివేయించారు. కార్పొరేట్ కాలేజీల దోపిడీని అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ కాలేజీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మాధవ్, ఓబులేసు, వినయ్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలోకి ప్రవేశించిన ముగ్గురి అరెస్ట్

మదనపల్లె : మండలంలోని ఎగువకురవంక పొన్నూటిపాళ్యంలోని భువనేశ్వరి ఆలయానికి చెందిన వివాదాస్పద స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన ముగ్గురిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని బెంగళూరురోడ్డుకు చెందిన నాదెళ్ల వెంకటస్వామినాయుడు(75), అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరూ కలిసి భువనేశ్వరి దేవాలయ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తూ, ఒకరికొకరు చర్చించుకుంటూ..శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేరాలకు పాల్పడే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నట్లు భువనేశ్వరి దేవాలయం వ్యవస్థాపకులు వెంకటేష్ ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : స్థానిక నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేవుట్ వద్దనున్న వరసిద్ధ వినాయక స్వామి ఆలయం వద్ద బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ అభయ నిర్వాహకులు తెలిపారు. నారాయణ హృదయాలయ, జాలప్ప మెడికల్ కాలేజీ వైద్య బృందం గుండె పరీక్షలతో పాటు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. చేనేత కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

27న జిల్లా సబ్ జూనియర్ ఫుట్ బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : మదనపల్లె మిషన్ కాంపౌండ్‌లో ఈనెల 27న జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్,మురళీధర్ తెలిపారు. వర్షం కారణంగా మంగళవారం జరగాల్సిన ఎంపికలు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని క్రీడాకారులు గమనించాలని కోరారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

పెద్దతిప్పసముద్రం : దీర్ఘకాలిక, సీజనల్ వ్యాధుల బారిన పడి నిత్యం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డాక్టర్ అభిలాష్‌కు ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న సూచించారు. సిబ్బంది నిర్లక్ష్య ధోరణిపై రోగుల నుంచి ఫిర్యాదులు రావడంతో మంగళవారం ప్రజా ప్రతినిధులతో కలసి ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి మండలంలోని కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి

మదనపల్లె సిటీ : కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఈనెల 28న విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నాయకులు ప్రకటించారు. మంగళవారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో 28న విద్యాసంస్థల బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

- పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై శ్రద్ధ వహించండి
- సేంద్రీయ ఎరువుల తయారీపై దృష్టి సారించాలి
- పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్ల సమీక్షలో డీపీఓ ధనలక్ష్మి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

పెద్దతిప్పసముద్రం : ప్రజల నుంచి వచ్చే స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా సత్వర పరిష్కారం చూపాలని జిల్లా డీపీఓ, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఆమె స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ సచివాలయం, డంపింగ్ యార్డును తనిఖీ చేసిన అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యదర్శులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీదారుని సమస్యను 24 గంటల్లో సంతృప్తికరంగా పరిష్కరించాలని, లేకుంటే అసంతృప్తి అయినట్లు ప్రభుత్వ లాగిన్‌కు అప్‌లోడ్ అయితే సదరు అధికారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వం పిల్లల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను వారి తల్లిదండ్రులకు వివరించి సమీపంలోని అంగన్‌వాడీ,లేదా ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేలా చూడాలన్నారు. జిల్లా అధికారుల నుంచి ఫోన్లకు పంపే సమాచారంపై కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కేంద్రం బృందం నిర్వహించే తనిఖీలో ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయాల్లో జరగబోవు నగదు రహిత లావాదేవీల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రీయ ఎరువుల తయారీపై దృష్టి సారించాలన్నారు. చెత్త సంపద కేంద్రాల షెడ్లు మంజూరైనా ఎందుకు నిర్మాణాలు జరగలేదని ప్రశ్నించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లనుద్దేశించి మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణుల రక్తహీనత సమస్యలను ముందే గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీలకు పలు ఏజెన్సీల నుంచి వచ్చే వస్తువులను క్షుణంగా పరిశీలించాలని, ప్రధానంగా తయారీ , ముగింపు తేదీలను క్షుణంగా పరిశీలించాలన్నారు. నాణ్యతగా లేకుంటే తిరిగి వెనక్కి పంపాలని సూచించారు. నాడు-నేడు ద్వారా మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు వేగవతం అయ్యేలా చూడాలన్నారు. చిన్నారుల ఆధార్ నమోదుతో పాటు ముఖ్యంగా పిల్లలకు క్రమశిక్షణ నేర్పాలని హితబోధ చేసారు. సమావేశంలో సీడీపీవో భాగ్యమ్మ, ఈవోఆర్డీ మనోహర్, సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, హిజాత్ ప్యారీ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ మద్దతు హామీని విరమించుకోవాలి

మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య



మాట్లాడుతున్న మాలమహానాడు అధికారి ప్రతినిధి వీరభద్రయ్య

వాల్మీకిపురం : పుంగనూరుకు చెందిన రామచంద్ర యాదవ్ గుంటూరు సమీపంలో నూతన పార్టీని ఆవిష్కరించి, పలు హామీలు చేశారని, ఇందులో ఎస్సీ వర్గీకరణ మద్దతు హామీని విరమించుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరినీ కలుపుకొని పోవాలని, పార్టీ విధివిధానాలలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తామని ప్రకటించారని, వర్గీకరణ గురించి ఏమి తెలుసని ప్రకటన చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య, మండల అధ్యక్షులు భాస్కర్, నాయకులు శివారుపల్లి సుధాకర్, శ్రీనివాసులు, అశోక్ కుమర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వరిలో చీడపీడల నివారణపై శిక్షణ



చీడపీడల నివారణపై శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్

వాల్మీకిపురం : వేరుశనగ, వరిలో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై మండలంలోని చారావాండ్లపల్లిలో రైతులకు మంగళవారం కలికిరి కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి సిఫారసు మోతాదులోనే యూరియ వాడాలని సూచించారు. పొటాష్ ఎరువును ఎకరానికి 25 నుంచి 30కిలోలు విధిగా వాడాలని, వరిలో ప్రతి 2మీటర్ల దూరానికి 20 సెంటిమీటర్ల వెడల్పుతో కాలిబాటలు తీయడం ద్వారా పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల సమస్య తగ్గుతుందన్నారు. వరిని ఆశించే తెల్లచీడ నివారణకు కార్బస్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటికి 2 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో హేమలత, వెంకట్రమణ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో జనరంజక పాలన అందుతోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే బాలంవారిపల్లె పంచాయతీ బాలంవారిపల్లె, కురవపల్లె, మొరవపల్లె, తూగుంట పల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం రూ. లక్ష నుంచి రూ. పది లక్షల వరకు ప్రభుత్వం ఆర్థికంగా లబ్ధి పొందినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దూసుకుపోతోందని చెప్పారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ఒక వర్గానికి మాత్రమే పథకాలు అందించేదని తెలిపారు. అదే ప్రస్తుతం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల మత వర్గాలకు అతీతంగా అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా సంక్షేమ పథకాలు అంది ఆర్థిక లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంబాలు, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత కారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్ మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ బి.డి. నారాయణ రెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ దామోదర, పార్టీ నాయకులు బి.డి. మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రమణారెడ్డి, యల్లారెడ్డి, స్వరూపరెడ్డి, సురేంద్ర, ఎస్.వి. చలపతి, చిన్నయల్లప్ప, ఎ.ఎస్. హుమయూన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తంబళ్లపల్లె : సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డాక్టర్ అనుపమ అన్నారు. మంగళవారం కోసువారిపల్లె పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల సహకారంతో వారివారి పరిధిలోని గ్రామాలలో సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, అతిసారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎస్.గంగాధర్(35) పుంగనూరుకు వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా బడిసినికొండ పంచాయతీ గంగమ్మ గుడి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి గాయపడ్డాడు.

నేడు మహల్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి : మండలంలోని మహల్ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మహల్ పరిధిలోని మహల్ కస్బా, మహల్ హరిజనవాడ, కూరాకులపల్లిలో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించి, ప్రజా సమస్యలపై విచారిస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరవ్వాలని ఆయన కోరారు.

బస్టాండులో ఆక్రమణల తొలగింపు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె బస్టాండులోని ఆక్రమణలు తొలగించినట్లు ఎస్ఐ రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి మంగళవారం తెలిపారు. బస్టాండులో ట్రాఫిక్ సమస్యల పై స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణలను తొలగించినట్లు చెప్పారు. ఇటీవల బస్టాండులో రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా కాలువలు నిర్మించారని, కాలువల ముందున్న స్థలంలో దుకాణదారులు ఆక్రమించు కోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా రోడ్డు పై ఆక్రమించిన స్థలంలో ఆక్రమణలు తొలగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత గేటు చెల్లించాల్సిన అవసరం లేదు



వ్యాపారులతో మాట్లాడుతున్న సర్పంచ్

పీలేరు రూరల్ : పీలేరులో ప్రతి మంగళవారం నిర్వహించే వారపుసంతకు రైతులు, వ్యాపారులు ఎలాంటి గేటు (రుసుం) చెల్లించాల్సిన అవసరం లేదని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన వారపు సంతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో వ్యాపారులకు, రైతులకు ఎలాంటి గేటు లేకుండా ఏడాదికి సరిపడా ఎంపీ సొంత నిధులు చెల్లించారన్నారు. పంచాయతీ ద్వారా ఇచ్చిన గుర్తింపు కార్డులు వ్యాపారులు, రైతులు విధిగా వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా గేటు అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డు మెంబరు సచిన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉన్నతికి వడ్డీలేని రుణాలు



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : మహిళల ఉన్నతి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం వడ్డీలేని రుణాలు మంజూరు చేయడమే కాక, మహిళలకు శ్రీనిధి, ఉన్నతినిధి, వీఓ, మండల సమాఖ్య, బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తోందని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని మహిళా సంఘాల వీఓ లీడర్లు, వెలుగు సీసీ లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీ మేరకు మహిళా సంఘాలకు విరివిగా రుణాలు ఇవ్వడం, సకాలంలో చెల్లించే రైతులు, మహిళలకు పావలా వడ్డీకూడ వారివారి ఖాతాలో జమచేస్తున్నారన్నారు. మహిళలే మహారాణులు అనేవిధంగా నేటి ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇంటి పట్టాలు, రాయితీ రుణాలు, పెట్టుబడి రుణాలు, ఆసరా వంటివి మంజూరు చేయడం జరుగుతోందన్నారు. అవకాశాలను ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించి ఆర్థిక అభివృద్ధి సాధించడానికి వెలుగు సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రమేష్, సీసీలు, మండల సమాఖ్య సిబ్బంది, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి

వాల్మీకిపురం : స్థానిక బోగంపల్లి రిజర్వాయర్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరారు. మంగళవారం ఎన్‌హెచ్ అధికారి వెంకట్రమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్‌హెచ్ రోడ్డుకు ఇరువైపులా వందల ఎకరాల్లో పంట పొలాలు ఉన్నాయని, రోడ్డు దాటుకొని వెళ్లేందుకు అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. ట్రాక్టర్లు, పని ముట్లు తీసుకెళ్లేందుకు, పశువులను తీసుకెళ్లేందుకు సహాయ పడుతుందన్నారు. అనంతరం తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, బలరాం, కిషోర్, పులిబ్రదర్స్, రామక్రిష్ణ, రాజశేఖర్, సురేంద్ర రెడ్డి, గురునాథ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రామక్రిష్టారెడ్డి, నంద కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



భయంలేని బతుకు నవలను ఆవిష్కరిస్తున్న కళాభిమానులు

మదనపల్లె సిటీ : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని కళారత్న అవార్డు గ్రహీత, సామాజిక సేవా కార్యకర్త పుట్టపర్తి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లో ప్రజాచైతన్య స్రవంతి ఆధ్వర్యంలో భరతముని ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు మునికృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ప్రతిభా పురస్కారం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో ఎంతో మంది రచయితలు పేరుప్రఖ్యాతులు గాంచినట్లు పేర్కొన్నారు. ప్రజాచైతన్య స్రవంతి పేరుతో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకుల సేవలను కొనియాడారు. జ్ఞానోదయ పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావుకు ప్రజా చైతన్య స్రవంతి-2023 ప్రతిభా పురస్కారాన్ని రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి అందజేశారు. మునికృష్ణారెడ్డికి నివాళిగా టీ.ఎస్.ఎ.కృష్ణమూర్తి భయంలేని బతుకు నవలను ప్రముఖ విమర్శకులు జొన్నవిత్తుల ఆవిష్కరించారు. ప్రజాచైతన్య స్రవంతి అధ్యక్షులు తిరుపతిరావు, కార్యదర్శి నాగభూషణరావు, కథా రచయిత వేంపల్లి అబ్దుల్‌ఖాదర్, లయన్స్‌క్లబ్ భాస్కరాచారి,శకుంతలమ్మ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

తంబళ్లపల్లె : హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మొహర్రం(పీర్లు) పండుగను పట్టణంలో ఘనంగా జరుపుకుంటారు. మొహర్రం పండుగ సందర్భంగా పీర్లను పీర్లచావిడిలో కొలువుదీర్చారు. చెక్కెర చదివింపులు చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, స్థానిక సర్పంచు నీలూఫర్ సహకారంతో పండుగను వేడుకగా జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు పెద్దపీర్ల మెరవని

పెద్దతిప్పసముద్రం : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కందుకూరులో ఈ నెల 28న పెద్దపీర్ల మెరవని జరుగునని నిర్వాహకులు పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా గ్రామంలో ఏడాదికోసారి అత్యంత వైభవంగా జరిగే ఈ పండుగకు చుట్టు పక్కల గ్రామాల వారే గాక బెంగళూరు, హైదరాబాద్ లాంటి మహా నగరాల నుంచి కూడా ప్రజలు వచ్చి పండుగలో పాల్గొంటారు.

మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

కేవీపల్లె : మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజన్న అన్నారు. మంగళవారం కేవీపల్లెలో ఏపీ ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాదిగల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఆర్థిక, రాజకీయ, సాంఘికంగా మాదిగలు రాణించాలంటే ఐక్యమత్యంతో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు దొడ్డి నరేష్, ఎ. శ్రీనివాసులు, ఈపూరి ఆంజినేయులు, చంద్ర, అశోక్, గురునాథం గురుశంకరప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా వైఎస్సార్ సంపూర్ణపోషణ

పీలేరు రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పారదర్శకంగా అందించాలని సీడీపీఓ రాజమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని బాలంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో రేగళ్ల సెక్టారు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుంచి ఇంటి వద్దనే పోషకాహారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాగిపిండి, జొన్నపిండి, బెల్లం, చిక్కీలు, కర్జూరం, బియ్యం, పాలు, కోడిగుడ్లు, వంటనూనె, కందిపప్పుతో కూడిన బ్యాగును పంపిణీ చేయాలని ఆదేశించారు. సూపర్‌వైజర్ ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు భార్గవి, ఫరీదా, భూదేవి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ హోంగార్డు మృతి

బి.కొత్తకోట : బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఆదినారాయణ (33) తిరుపతి స్విమ్స్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ రామమోహన్ తెలిపారు. కర్ణాటక సరిహద్దు బడికాయలపల్లె చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ సోమవారం అస్వస్థతకు గురయ్యాడు. చికిత్సకోసం తిరుపతి స్విమ్స్ తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులకు పలు ఆరోగ్య సమస్యలు ఉన్నట్టు గుర్తించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. ఆదినారాయణ మృతికి పోలీసు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మదనపల్లె సిటీ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వాసవీక్లబ్ అధ్యక్షుడు నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసేవ ,ప్రకృతిసేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.

ప్రతి ఓటరు జాబితాలో నమోదు కావాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలక్రిష్ణ



మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలక్రిష్ణ

కలకడ : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు కావాలని పీలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పీలేరు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలక్రిష్ణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని కలకడ పోలింగ్ స్టేషన్‌నెంబర్-59లోని ఓటర్ల జాబితా తనిఖీ చేశారు. ఓటర్లు జాబితాలో అర్హులు ఉన్నారా, అనర్హులు కూడ నమోదు చేయబడ్డారా అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఫిర్యాదులు బీఎల్‌ఓ పరిధిలో రాకూడదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని రాజకీయపార్టీల లీడర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ముందే ఓటర్లు జాబితా ప్రచురితం చేయడం జరుగుతుందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా నమోదు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఓటర్లుజాబితాలో పేర్లు, వయస్సు, గ్రామం వంటివి ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు .కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, వీఆర్ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటరు సర్వేకు సహకరించండి

గుర్రంకొండ : ఇంటింటా ఓటరు నమోదు సర్వే కార్యక్రమానికి అన్ని పార్టీలు సహకరించాలని పీలేరు నియోజక వర్గ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 21నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి బీఎల్వోలు వెళ్లి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకులను ఓటర్లుగా చేర్చే ప్రక్రియ చేపడతారన్నారు. మార్పులు చేర్పులు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకురావచ్చన్నారు. సర్వే పూర్తి అయిన తరువాత పూర్తి వివరాలు మళ్లీ సమావేశం నిర్వహించి వెల్లడిస్తామన్నారు.